స్కెచ్

# ఆనాటి రోజులు

"ధర్మరాజు"

"ఒరే వెంకా! ఆయనెవరో గుర్తుపట్టినావు?" ఏదో మాటామంతీ సాగించిన రంగడు మాటమార్చి వెంకనితో అన్నాడు.

"ఎవరైతే మనకేంలే ఎవరో మారాజు" అంటూనే రంగడు చూపిన వ్యక్తివైపు వెంకడు శ్రద్ధగా చూడసాగాడు.

"నేను కూడా మొదట గుర్తుపట్టలే, ఆ వంకరచెయ్యి చూస్తే జ్ఞాపకమొచ్చిందిరా."

"ఓ! ఆయనా. దొర. తంతే తన్నిండుగాని, భలే గట్టి మనిషిరా, నీవేమన్నను"

"గట్టా గట్టా, ఆ యంకల్లో ఇంకోడిని అడుగుపెట్టనిచ్చిండురా?"

"అడుగంత దూరం పోయినావు? అసలు నీడ పారనిచ్చిండా?"

"ఏమన్నా కానీగాని, మన నోట్లో కూడ మన్నుబడ్డ నారోజుల్లో."

"మరే. పోనీలేగాని, పొయ్యి మందలిద్దామంటావా?"

"వద్దశ, ఎందుకొచ్చింది. గాశారం చాలక పాతయన్ని బయటపెడితే?"

"అప్పుడంటె, ఆరోజులట్లా ఉండేవనకో, ఏదో మన కర్మంకాలి చావు దెబ్బ తిన్నాం గాని, తొంటదొర బలే మంచోడని లోకమంత దండం పెడ్తదిరా!"

"మంచోడు కాకేం! మన బుద్ధులు బాగ లేక వాండ్ల నంటమే గాని, వాండ్లేం పెండ్లాం పిల్లలకోసం ఆపనులు చేసిన్రా? ఏదో మంచికే చేసుంటరు. వాండ్లెంత సంపాయించినా బీదోళ్లకే మనం ఎంత సంపాదించినా ముండలకు, తాగుడుకే చాలదు. మనకు వాండ్లకు పోలికెక్కడని"

"పొయ్యి మాట్లాడుదాంరా! ఏమైతది?"

"సరే! పద నేను కూడా వస్తా."

ఇంద్రసేనుడు తన కార్యదర్శి, కారు డ్రైవరు ఏవో కొనితెచ్చుటకు బజారుకు వెళ్లగా మోటారువద్ద నిలుచుండి ఒక పరిచయవ్యక్తితో మాట్లాడి మోటారులో కూర్చోగానే రంగడు వెంకడు మెల్లిగా వెళ్లి దూరంగా నిలుచుండి. ముసిముసి నవ్వుతో దండం పెట్టారు.

ఇంద్రసేనుడు గుర్తించనట్లు లాంఛనంగా దండాల్ని స్వీకరించినట్లు తలనాడించి వార్తాపత్రికను విప్పసాగాడు

"బాగున్నారా దొరా?" రంగడు నవ్వు ముఖంతో మందలించాడు.

వాండ్లకేం మారాజులు. పెట్టి పుట్టిన దొరలు" వెంకడు ఇంద్రసేనుని చూస్తూ అన్నాడు.

ఏమిటి వీండ్లకింత చనువు అన్నట్లు వింతగా వాండ్లను ఒకసారి చూచి, "ఎక్కడో చూచిన ముఖాలే. ఎవరై యుంటారు" అని తనలో ఇంద్రసేనుడు తర్కించుకొనసాగాడు.

"మారాజులు కష్టపడ్డందుకు గట్టెక్కిన్రు మేము ఉన్నకాడనే ఉన్నాము. పాపపు పుటకలు" రంగడు గోళ్లుగిల్లుకుంటూ అన్నాడు.

"వాండ్లంటే ఇల్లనక, ముంగిలక, పిల్లనక, మేకనక, చెట్లు గుట్టలు పట్టి ఎంత చెడపడ్డారురా పాపం" వెంకడు రంగడికి తోడుగా మాట్లాడాడు.

ఇంద్రసేనుడు ఆలోచనలో పడ్డాడు. పోరాటకాలములో తన జీవిత ఘట్టాలను, కష్టాలను ఒక్కొక్కటి జ్ఞాపకం రావడంతో కలిగిన ఆనందాన్ని పట్టలేక, కండ్లద్దాలు తీసి తుడుచుకుంటూ "మిమ్ములనెక్కడో చూచినట్లుంది. ఏ వూరు మీది" ఉత్సాహంతో ప్రశ్నించాడు.

"ఊరైతే ఇదేకాని మేము ఇండ్లు కట్టుకొని తినే దశ లేదు దొరా" రంగడు నిస్పృహతో మాట్లాడాడు.

"అయితే నన్నెక్కడ చూచారు?" ఇంద్రసేనుడు ప్రశ్నించాడు.

"చూడటమేమిటి దొరా! మీవాండ్లు మమ్ముల బొక్క బొక్క ఇరుగదన్నింది మరచారా దొరా?" వెంకడు అన్నాడు.

"ఎవరు? ఎక్కడ, ఎందుకు మిమ్ములను కొట్టారు? నేను కొట్టించానా? అబ్బే నేను మిమ్ములనెందుకు కొట్టిస్తాను?" ఇంద్రసేనుడు ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు.

"తేనెతెట్టెబీడులో జరిగిన సంగతి మరచారా దొరా?" రంగడు అడిగాడు.

"సుఖపు రోజుల్లో ఆ కష్టపు రోజుల సంగతెందుకులే, కళ్ళక్కి ఇన్ని పైసలు అడుక్కొని పోదాం" వెంకడు సలహా ఇస్తూ ఇంద్రసేనుడి వైపు దీనంగా చూచాడు.

"తేనెతెట్టెబీడు సంగతా? ఇంకా మీరు మరువలేదా? పాపము మీరేనా చావుదెబ్బలు తిన్నది" ముసి ముసిగా నవ్వుతూ ఇంద్రసేనుడన్నాడు.

"అవును దొరా! మేమే, అప్పటి దెబ్బకు కడితికట్టి ఇప్పటికీ కొప్పి పెడ్తున్నది" రంగడు దెబ్బ చూపించాడు.

"అవునుగాని మీరు ఏమిటీ పిచ్చిచేష్టలు, అందరూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని నిద్రాహారాలు లేక ఉంటుంటే మీరు సమయం కని పెట్టి దొంగతనాలకు దిగటం ఏం బాగుంది?"

"అదేం మాకేం కొత్తగా దొరా? మా తాత ముత్తాతల కాలంనుండి వస్తున్నదాయెను. మేం చేసిన కొత్త పనేముంది? మీరే మానోట్లో మన్నుకొట్టిరను కాని."

"మా అయ్య చిన్నప్పటినుంచే మోకాళ్ళు, మోచేతులు కాయలు కాచేటట్టుకొట్టి కొట్టి సిద్ధంచేశాడు" రంగడు ఇంద్రసేనునికి మోకాళ్లు మోచేతులు చూపించాడు.

"ఐతే మీ రాపని మానుకోరన్న మాట" ఇంద్రసేనుడు ప్రశ్నించాడు.

"వేరే ఏముందని దీన్ని మానుకోవడం దొరా!" వెంకడు వెంటనే అడిగాడు.

"దొరా మీకు కోపం రాకపోతే ఒకటి అడుగుతా, మీరు సర్కారుమీద కత్తికట్టిన ఆ రోజుల్లో మా నోట్లోమాత్రం మన్నుకొట్టిరను. ఎక్కడపోయినా మీదే గోల, ఏది దొరికినా మీకేనాయె. ఆ రోజుల్లో మేముపడ్డ కష్టాలు చెప్పితే తీరవు!" రంగడు అన్నాడు.

"అయితే మీరు మా పేరు పెట్టుకొని ఆ పను లెందుకు చేశారు?" ఇంద్రసేనుడు కొంచెం కటువుగా అన్నాడు.

"ఎవరైనా పొట్టకేకద దొరా! మాకు వేరే ఏముందని బ్రతకడం" వెంకడు జవాబిచ్చాడు.

"అదిగాక ఏదో "జై" అంటే దొంగలు కారని లోకులనుకుంటారు. అందుకోసం మే మట్ల చేసినాం. అంతే కాని మీవోలె దొర తనము చేయటానికి కాదు దొరా?" రంగడు ఉన్న నిజం వెళ్ళగక్కాడు.

"ఇప్పుడు దొంగలుకూడా "జై" అంటున్నారని లోకానికి తెలిసిపోతున్నదిరా. అది కూడా దాగకుండ వచ్చింది" వెంకడు నవ్వుకుంటూ అన్నాడు.

"ఎవడికి వచ్చింది వాడు చేస్తడుగద దొరా?" రంగడు ప్రశ్నించాడు.

"ఊహూం" అంటూ ఇంద్రసేనుడు తిరిగి పత్రిక విప్పాడు.

ఇంతలో కార్యదర్శి, కారు డ్రైవరు కొన్ని వస్తువులు తేగానే సదిరి పెట్టడంలో రంగడు, వెంకడు సాయపడ్డారు.

కారు బయలుదేర సాగింది.

"ఏమైనా ఇనాం చెప్పూ దొరా" వెంకడు అడిగాడు.

"ఇనాం ఏందిరా? దొర తలచుకొంటే కొలువు ఇప్పిస్తాడు లే" రంగడు అన్నాడు.

"అవును దొరా. మీ కాడ చప్రాసీ పని చేస్తాను ఉంచుకో" వెంకడు ఆశతో అడిగాడు.

ఇంద్రసేనుడు "దొంగల నెవరు కొలువుంచుకుంటారురా" అంటూ "పోనీ" అని డ్రైవరు ఆజ్ఞాపించాడు.

కారు వెళ్ళిపోయింది.

"ఆ రోజుల్లో మాకంటె ఏమి తక్కువచేసినారంట. వీండ్లు సర్కార్ను నడిపితే మనము చప్రాసీకికూడా పనికిరామా" అని కొంటెగా నవ్వుతూ, మోటారు చూపుదాటిందాకా చూస్తూ నిలుచున్నారు వాళ్లు.